## క్లుప్తంగా

### నేడు 'సచివాలయ' భవనం ప్రారంభోత్సవం

పిట్టలవానిపాలెం: భవనంవారి పాలెంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు గ్రామ కార్యదర్శి వసుంధర లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి పాల్గొంటారని పేర్కొన్నారు.

### హెల్మెట్ ధారణ తప్పనిసరి



పిట్టలవానిపాలెం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చందోలు ఎస్ఐ రాజశేఖర్ స్పష్టం చేశారు. చందోలు, రెడ్డిపాలెం గ్రామాల పరిధిలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. హెల్మెట్ ధారణతో ప్రమాద సమయంలో ప్రాణాలను చాలా వరకు రక్షించుకోవచ్చని చెప్పారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. జాతీయ రహదారిపై అతి వేగం ప్రమాదమని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

### ఆర్టీసీ సమ్మర్ స్పెషల్ బస్సుల ఏర్పాటు

తెనాలి: ఆర్టీసీ తెనాలి డిపో నుంచి వివిధ పుణ్యక్షేత్రాలు, విహార ప్రదేశాలకు సమ్మర్ స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు మేనేజర్ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఇందులో భాగంగా ఊటీ, వేళాంగిణిలకు ఈనెల 27న ప్రత్యేక బస్సులు బయలుదేరతాయని తెలిపారు. ఊటీకి ఏసీ బస్సు ఆరోజు సాయంత్రం 5 గంటలకు తెనాలి నుంచి బయలుదేరి బెంగళూరు, మైసూర్ ప్యాలెస్, మైసూరులోని ముఖ్య ప్రదేశాలతో పాటు మరుసటి రోజు మొత్తం ఊటీలోనే ఉండి ప్రముఖ ప్రదేశాల్ని తిలకించే అవకాశం కల్పిస్తుందని, టికెట్ ధర రూ.4,600గా వివరించారు. అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటలకు సూపర్ లగ్జరీ బస్సు వేళాంగిణి (నాగపట్నం) బయలుదేరుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం నాగపట్నం చేరుకుని రోజంతా అక్కడే ఉండి, మరుసటిరోజు చెన్నైకు చేరుకుని సెయింట్ థామస్ మౌంట్ చర్చి, మెరీనా బీచ్ చూసుకుని రాత్రికి తిరుగు ప్రయాణం ఆరంభిస్తుందని వివరించారు. టికెట్ ధర రూ.3,400గా తెలిపారు. ఇతర వివరాలకు 7382892492/ 9959225422 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

### మందుబాబులపై కేసులు

తెనాలి రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం శివారు చినపరిమి డొంక రోడ్డు, ఇతర ప్రదేశాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న ఐదుగురిని రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు శనివారం గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు. పెదరావూరు వద్ద వాహన తనిఖీల నిర్వహించారు. నిబంధనలు పాటించని 10 ద్విచక్ర వాహనాలు, మూడు ట్రాక్టర్లు, రెండు లారీలు, ఏడు ఆటోల డ్రైవర్లకు రూ. 3800 అపరాధ రుసుం విధించారు.

### వివాహిత అదృశ్యం

తెనాలి రూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన 30 ఏళ్ల కోట ఝాన్సీ ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసుల్ని ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ శనివారం తెలిపారు.

### స్నేహితుడిపై చాకుతో దాడి

తెనాలి రూరల్: స్నేహితుడిపై చాకుతో దాడి చేసి గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సుమంత్, వీరబాబు క్యాటరింగ్ పనులకు వెళుతుంటారు. స్వల్ప విషయమై వీరిద్దరూ శుక్రవారం సాయంత్రం ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో వీరబాబు సుమంత్‌పై చాకుతో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు.



# గృహ లబ్ధిదారులను చైతన్యపరచాలి

రేపల్లె: వైఎస్సార్ జగనన్న కాలనీలలో నివేసన స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన గృహాలు నిర్మించుకునేలా అధికారులు చైతన్యపరచాలని ఆర్డీఓ పార్థసారథి సూచించారు. రేపల్లె డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలతో గృహ నిర్మాణాలపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించి, ఆయన మాట్లాడారు. పేదవారి సొంతింటి కల సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులను గుర్తించి, నివేసన స్థలాలు జారీచేసిందన్నారు. గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించాలని చెప్పారు. నేటి వరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు శంకుస్థాపన చేసుకునేలా, నిర్మాణంలో ఉన్నవి త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

**గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి**

వేమూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని బాపట్ల డీఆర్‌డీఏ పీడీ బొంత అర్జునరావు చెప్పారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ రాజ్, వైఎస్ క్రాంతి పథం అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెడితే పురోగతి సాధించడం జరుగుతుందన్నారు. వేమూరు మండలం గృహ నిర్మాణాల్లో చాల వెనుకబడి ఉందని తెలిపారు. నిర్మాణాలు చేపట్టక పోతే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ గృహ నిర్మాణ బిల్లులు వెంటనే చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, శోభన బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు సినీ సాహిత్య 'సిరి'వెన్నెల

బాపట్ల అర్బన్: తెలుగు సినీ సాహిత్యంలో పున్నమి వెన్నెల కురిపించిన సిరివెన్నెల సీతారామశాస్త్రి దాదాపు 800 సినిమాలకు 3 వేల పైచిలుకు పాటలు రచించారని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ పేర్కొన్నారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో శనివారం సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి సభను నిర్వహించారు. రావూరి నరసింహవర్మ అధ్యక్షత వహించారు. సిరివెన్నెల చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. సాహితీ భారతి ఉపాధ్యక్షుడు మల్లి మాల్యాద్రిరావు మాట్లాడుతూ సీతారామశాస్త్రి సాహిత్య సృజన చేశారని, 11 నంది, నాలుగు ఫిలింఫేర్ అవార్డులతో పాటు పద్మశ్రీతో కూడా సత్కరింపబడ్డారని ప్రశంసించారు. కోశాధికారి ఆదం షఫీ, ఎం.జాకబ్ ఎస్.కృష్ణ, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళీ, రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జొన్న వ్యర్థాలతో భూ సారాన్ని పెంచుకోవచ్చు

చేబ్రోలు(పొన్నూరు): రబీలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న వ్యర్థాలను తగుల పెట్టకుండా భూమిలో కలియబెట్టి భూసారాన్ని పెంచుకోవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. పొన్నూరు మండలం తాళ్లపాలెం గ్రామం సంగమేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో శనివారం వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియబెట్టి భూసారాన్ని పెంచుట అనే అంశంపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలు కుళ్లి భూమికి సేంద్రియ ఎరువుగా మారుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం టీపీడీ పీ రామాంజనేయులు, శాస్త్రవేత్త ఎం.గంగాదేవి, పొన్నూరు ఏడీఏ సీహెచ్ తిరుమలదేవి, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వర రావు పద్మలీల, సర్పంచి వీరయ్య పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు

## యువకుడి దుర్మరణం

చేబ్రోలు: కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. చేబ్రోలు మండలం పాతరెడ్డిపాలేనికి చెందిన జస్వంత్ బీబీసీ రహదారి పక్కన ఫుడ్ కోర్టును నిర్వహిస్తున్నాడు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై చేబ్రోలు వైపు బయలుదేరాడు. విజయవాడ నుంచి పొన్నూరు వైపు వెళ్తున్న కారు అతివేగంతో బైక్‌ను ఢీ కొట్టింది. ఎగిరి రోడ్డు పక్కన పడిన జస్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత

బాపట్ల అర్బన్: సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత ఏర్పడుతుందని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ కోటి బాల నాగయ్య అన్నారు. బాపట్ల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో సభ్యులతో కలిసి సమాచార హక్కు చట్టం కింద అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపీ, తెలంగాణ పరిధిలోని 59 మండలాల్లో సమాచార హక్కు చట్టం ద్వారా అర్జీలు అందజేయడంతో పాటు సమాచారం సేకరించి సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. వాటిలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేవని ఈ విషయంపై సమాచారం కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లే మార్గం లేనందువల్ల చదువు మధ్యలో ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పరిశీలించాల్సిందిగా కోరుతూ బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం, సమాచార అర్జీని అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్ సంస్థ సభ్యులు తోటకూర శ్రీనివాసరాజు, రాజారావు ఉన్నారు.



అర్జీని అందిస్తున్న సీసీఆర్ సంస్థ ప్రతినిధులు

## బాధిత కుటుంబానికి గ్రేస్ ఫౌండేషన్ ఆపన్నహస్తం

అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లిలో ఇటీవల ప్రమాదవశాత్తూ పూరిల్లు దగ్ధం కాగా, బాధితురాలు అమర్తలూరి సౌదామణికి గ్రేస్ ఫౌండేషన్ ఆపన్నహస్తం అందించింది. ఫౌండేషన్ చైర్మన్ కై తేపల్లి షాలేమ్‌రాజు శనివారం బీరువా, డ్రెస్సింగ్ టేబుల్, రెండు కుర్చీలు, మంచాలు, వంట సామగ్రి, బియ్యం డబ్బా, స్టీలు సామాను, 25 కిలోలు బియ్యం అందించారు. ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తానని ఫౌండేషన్ సభ్యులు యన్నం సురేష్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ యడ్ల జయశీలరావు, ఫౌండేషన్ సభ్యులు యలమాటి దాసు, క్రాప నాని, దాసరి కిరణ్, కనపర్తి రమేష్, డాకరి బుజ్జి, కంచర్ల దేవమణమ్మ, పప్పుల మనోజ్ కుమార్, వేము నాంచారమ్మ, పప్పుల ఆదామ్, సువ్వా బాబురావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సామగ్రి అందజేస్తున్న గ్రేస్ ఫౌండేషన్ సభ్యులు

## సబ్ జైలు పరిశీలన

తెనాలి రూరల్: తెనాలి సబ్ జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. జైలు ఆవరణను పరిశీలించి, ఖైదీల వసతుల గురించి ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీటిని పరిశీలించారు. అనంతరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి, ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల జైలుపాలు కావాల్సి వచ్చి ఉంటుందని, ఇకనైనా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తాగు నీరు, ఫాగింగ్ విషయమై జైలు సిబ్బందికి సూచనలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్ న్యాయమూర్తితో ఉన్నారు.




ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

## కామ్రేడ్ సుందరయ్యకు ఘన నివాళి

అమర్తలూరు(వేమూరు): పేదలకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్యని మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్ అన్నారు. అమర్తలూరులో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 35వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు బొనిగల ఆగస్టీన్ విశ్రాంతి ఉపాధ్యాయులు గుత్తికొండ శాంత కుమారి పూలమాల వేసి, ఘనంగా నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూచిపూడి సతీష్, బాబు జగజ్జీవన్‌రావు, అత్తోట రమేష్, వేమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సుందర్య చిత్రపటానికి సీపీఎం నాయకుల నివాళి

## భక్తిశ్రద్ధలతో గ్రామదేవతల కొలుపులు

బాపట్ల అర్బన్: ముత్తయ్యపాలెంలో గ్రామ దేవతలు కనకదుర్గమ్మ, మారమ్మ, మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ కొలుపులు ఐదు రోజులు పాటు కొలుపులు ఘనంగా నిర్వహించారు. శనివారం భక్తులు అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. పలు వేషధారణలతో ఊరేగింపుగా పోలేరమ్మ చెట్టు దగ్గరకు చేరుకున్నారు. వేగేసన నరేంద్రవర్మ రాజు, విచారపు వెంకట మునీశ్వరరావు, నర్రా నరసింహారావు, రాంబాబు, కర్రి వెంకటేశ్వరరావు, శంకరరావు, పి.మునీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ సినీ జీవితం రసవత్తరం

తెనాలి రూరల్: ఎన్టీఆర్ సినీ జీవితం రసవత్తరం అని పలువురు అభిమానులు పేర్కొన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ సినిమాలు, రాజకీయ జీవితంపై శనివారం రాత్రి చర్చాగోష్ఠి నిర్వహించారు. సినీ రంగంలో ఎన్టీఆర్ ఎందుకు శకపురుషుడు ? అనే అంశంపై బిట్రా యుగంధర్, పోపూరి రామ్మోహనరావు ప్రసంగించారు. సినీ పరిశ్రమను నాటి మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చి, తెలుగు సినీరంగ విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం కవి, వ్యాఖ్యాత, నటుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరావును సత్కరించారు. కార్యక్రమంలో వెంపటి సత్యనారాయణ, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు పాల్గొన్నారు.



## 27 నుంచి ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు

తెనాలి రూరల్: స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామి దేవస్థాన ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ ఉత్సవాల్ని ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవాల గోడ పత్రికలు, కరపత్రాల్ని శనివారం రాత్రి ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఆలయ ధ్వజ స్తంభాన్ని 112 ఏళ్ల కిందట ప్రతిష్ఠించారనితెలిపారు.

# ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్

- 100 గజాల్లోపు వారికి ఉచితంగా డీకే పట్టా
- డిసెంబరు నెలాఖరు వరకు దరఖాస్తుకు అవకాశం

ప్రత్తిపాడు: భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ భూములలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న నిరుపేదలకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సర్కారు శుభ వార్త చెప్పింది. ఆవాస స్థలాలను క్రమబద్ధీకరించేందుకు సిద్ధమయింది. ఇందుకుగాను అర్హుల నుంచి దరఖాస్తులు కోరింది. బీఎస్ఓ 21, 26కి అనుగుణంగా 2019 అక్టోబరు 15 లేదా అంతకు పూర్వం అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను అనధికారికంగా ఆక్రమించుకుని జీవిస్తున్న వ్యక్తులకు భూమిని క్రమబద్ధీకరించే (కేటాయించే) కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 60 ద్వారా ప్రజల ముంగిటకు తీసుకువచ్చింది.

**నిర్ణీత రుసుం చెల్లించి..**

అనధికారికంగా ఆక్రమించుకుని నివాసం ఉంటున్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోదలచిన వారు తమ ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుంను చెల్లించాల్సి ఉంటుంది. 100 గజాల్లోపు ఉన్న వారికి 10 ఏళ్లలోపు భూ బదలాయింపు హక్కులు లేకుండా, పదేళ్ల తర్వాత భూ బదలాయంపు హక్కు సంక్రమించేలా ఉచితంగా డీకే పట్టా మంజూరు చేస్తారు. 101-200 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 50 శాతం, 201-300 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 100 శాతం, 300-500 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 150 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

**డిసెంబరు 31లోగా దరఖాస్తు..**

పూర్వం అభ్యంతరం లేని అనధికారికంగా ఆక్రమించుకుని ఉన్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోవాలనుకునే వారు డిసెంబరు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 101-500 చదరపు గజాల వరకు క్రమబద్ధీకరించుకోవాలనుకున్న వారికి నిర్ణీత రుసుం చెల్లించిన తరువాత రెవెన్యూ అధికారులు కాన్వేయన్స్ డీడ్ ద్వారా సదరు ఆస్తికి సంబంధించిన హక్కులను బదలాయిస్తారు. అభ్యంతరం లేని అనధికారికంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని నివసిస్తున్న వారు వారి గృహానికి సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ఇంటి నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి పన్ను రసీదు, ఇతర ఆధారాలున్నట్లయితే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతరుల వద్ద(కమ్యూనిటీ) లేని గ్రామ కంఠం భూములు, మందబయలు, నూర్పిడి కల్లాలు, పశువుల సంతలకు వినియోగించే భూములు.. వంటివి అభ్యంతరం కాని ఆక్రమిత ప్రభుత్వ భూముల పరిధిలోనికి వస్తాయని అధికారులు తెలిపారు.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం కాని ఆక్రమిత ప్రభుత్వ భూముల్లోని ఆవాస స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2019 అక్టోబరు 15వ తేదీ నాటికి గానీ అంతకు పూర్వం గానీ అనధికారికంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వ్యక్తులు భూములను క్రమబద్ధీకరించుకునేందుకు అర్హులు. వంద గజాల్లోపు వారికి ఉచితంగా డీకే పట్టా ఇస్తాం. ఆపై 500 గజాల్లోపు వారు నిర్ణీత రుసుం చెల్లిస్తే, కాన్వేయన్స్ డీడ్ ద్వారా సదరు ఆస్తికి సంబంధించిన హక్కులను వారికి బదలాయిస్తాం.

–ఎంఎల్ సంజీవకుమారి, తహసీల్దార్, ప్రత్తిపాడు

## ఘనంగా అమావాస్య హోమం

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలో గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో 51వ అమావాస్య హోమాన్ని అత్యంత వైభవోపేతంగా శనివారం నిర్వహించారు. అమ్మవారు శ్రీ బగళాముఖిగా నిజ స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. హోమంలో పలువురు భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని, పూజలు చేశారు. చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అమ్మవారి చిత్ర పటాలను వారికి బహూకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూర్ణాహుతి హోమంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈఓ నరసింహమూర్తి మాట్లాడుతూ అమావాస్యతో పాటు శనైశ్చరుని జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ శని దోషాలు తొలగిపోవాలని, అమ్మవారి వద్ద ప్రత్యేక పూజ నిర్వహించిన జలంతో భక్తులను ఆశీర్వదించారు. ఈ నెల 21న 16 రోజుల పండుగను పురస్కరించుకుని ఆలయధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఆదివారం అన్న సంతర్పణ చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ధర్మకర్తల మండలి సభ్యులు బుడ్డా వెంకట లక్ష్మి, సాయిబాబు, పెనుగొండ బాలకృష్ణమూర్తి, బాపట్ల ఏఎంసీ మాజీ డైరెక్టర్ కనికిచర్ల వెంకట ప్రసాద్, ఆలయ అర్చకులు శ్రీరామశర్మ, నరసారెడ్డి, కోటిరెడ్డి, బక్కారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమావాస్య హోమంలో భక్తులు